
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3, కనిష్ఠం 18.0

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

సోమవారం 19 ఫిబ్రవరి 2024


లక్కారం పాఠశాలలో నిర్మించిన ప్రహరీ, గేటు


పెయింటింగ్ కోసం ఎదురు చూస్తున్న ఉట్నూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల


● నిర్మాణం పూర్తయిన లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

- జిల్లాలో నత్తనడకన సాగుతున్న 'మన ఊరు-మన బడి' పథకం పనులు
- నాలుగేళ్లు కావొస్తున్నా.. పలుచోట్ల పూర్తి కాని మరమ్మతులు
- 2021 మార్చి 8న పథకాన్ని ప్రారంభించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్
- అదే ఏడాది టెండర్లను పిలిచిన సర్కారు
- పాఠశాలల విద్యా కమిటీల ద్వారా హుటాహుటిన ప్రభుత్వానికి నివేదికలు
- పలు పాఠశాలల్లో పూర్తయిన పనులు
- డబ్బులు రాక గుత్తేదారుల పరేషాన్
- నూతన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసేనా?
- జిల్లావ్యాప్తంగా ఈ పథకం కింద 237 పాఠశాలల గుర్తింపు

ఉట్నూర్, ఫిబ్రవరి 18: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులతో పాటు నూతన భవనాలు నిర్మించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 'మన ఊరు -మన బడి' పథకం ఆశయం ఘనంగా ఉన్నప్పటికీ.. ఆచరణలో విఫలం అయ్యింది. పథకం ప్రారంభించి నాలుగేళ్లు కావొస్తున్నా.. పలుచోట్ల పాఠశాలల నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి. ప్రతీ గ్రామంలో బడి, గుడి బాగుంటేనే గ్రామాలు అభివృది చెందినటుగా భావిస్తారు. గత బీఆర్ఎస్ పభ్రుత్వం 2021లో 'మన ఊరు-మన బడి' పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే, 2021 మార్చి8న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. అదే మాసంలో టెండర్లను ప్రారంభించిన ప్రభుత్వం ఆయా గ్రామాలలో పాఠశాల విద్యా కమిటీలు, సమావేశాలు నిర్వహించి ప్రాధాన్యత పనులు చేపట్టి గ్రామీణ ప్రాంత విద్యార్థులు చక్కగా చదువుకునేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా పాఠశాల విద్యా కమిటీల సమావేశాలు ఏర్పాటు చేయించి హుటాహుటిన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు.

జిల్లాకు రూ.వంద కోట్ల మంజూరు

జిల్లాలోని 18 మండలాలలో 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా పాఠశాలల మరమ్మతులు, నూతన భవనాలు, నిర్మాణం, విద్యుత్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, ప్రహరీ, అదనపు గదులను నిర్మించిడానికి ప్రభుత్వం జిల్లాకు రూ.వంద కోట్లు మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా 237 పాఠశాలలను గుర్తించి పనులు చేయాలని జిల్లా అధికారులు భావించారు. ఈ మేరకు అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు హుటాహుటిన పనులను ప్రారంభించి కొన్ని పనులకు టెండర్లు కాగా, మరికొన్ని పనులను అధికార పార్టీకి చెందిన నాయకులకు, కార్యకర్తలకు అప్పగించారు. ఈ పనులు తీసుకున్న నాయకులు కమీషన్ పద్ధతిపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఉట్నూరు మండలంలో 23 పనుల కోసం రూ.5.83 కోట్లు మంజూరు కాగా ఉట్నూర్, హస్నాపూర్, కుమ్మరి తండా, శ్యాంపూర్, సాలెవాడ, లక్కారం, పెరికగూడ, ఉమ్రి, అందోలి, తాంద్ర, బాబాపూర్, పాత ఉట్నూర్, దంతన్‌పల్లి, గంగన్నపేటలలో మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పనులు కోసం రూ.5.83 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.3.36 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంద్రవెల్లి మండలంలో ఇంద్రవెల్లి, హీరాపూర్, గౌరపూర్, దేవాపూర్, మామిడిగూడ, హర్కాపూర్, మార్కగూడ, హీరాపూర్, ధనోర, ముత్నూర్, సెటవాజిగూడ, అందునాయక్ తండాలలో పాఠశాలల కోసం రూ.3.91 కోట్లు మంజూరు కాగా, రూ.కోటి వరకు పనులు జరిగినట్లు తెలుస్తుంది. గాదిగూడ, నార్నూర్, సిరికొండా, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, ఆదిలాబాదు, బేల, జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలలో మొత్తం రూ.వంద కోట్లతో 237 పాఠశాలల భవనాలు, ఈ పథకం కింద మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 150 పాఠశాలలో ఈ పనులు పూర్తయినట్లు తెలుస్తుంది. ఈ పథకం కింద ఉట్నూరు మండలంలో లక్కారం ఉన్నత పాఠశాల, అందోలి, ఉట్నూరు జడ్పీఎస్ఎస్ పాఠశాల, దంతనపల్లిలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. చాలా పాఠశాలలో మంగుదొడ్ల పనులు పూర్తి కాకాపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

డబ్బులు రాక గుత్తేదారుల పరేషాన్

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా పాఠశాలల భవనాల పనులు చేపట్టిన గుత్తేదారులకు సకాలంలో ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. నిధులు రాకపోవడంతోనే గుత్తేదారులు పనులను నెమ్మదిగా చేస్తున్నట్లు తెలుస్తోంది. 237 పాఠశాలలో భవనాల పనులు ప్రారంభించినప్పటికీ 150 పాఠశాలలో పనులు పూర్తి కావొస్తున్నా.. గుత్తేదారులకు నిధులు అందకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. రూ.వంద కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం రూ29 కోట్ల వరకు మాత్రమే జిల్లాకు నిధులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. పనులు పూర్తయిన పాఠశాలలకు పెయింటింగ్ చేసే వారికి కూడా నిధులు రావడం లేదని భావిస్తూ పెయింటింగ్ పనులు పనులు పూర్తి చేయడం లేదు. ఇదే కాకుండా ప్రారంభోత్సవం పూర్తి చేసుకున్న పాఠశాలలకు జిల్లా విద్యా శాఖ అధికారులు గ్రీన్ చార్ట్ బోర్డులు, డ్యూయల్ డిస్కులు, ఫర్నిచర్ సరఫరా చేయాల్సి ఉంది. అయితే, విద్యాశాఖ అధికారులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ సరఫరా చేసే ఉద్యోగి అనారోగ్యం కారణంగా సరఫరాలో జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైన పూర్తిస్థాయి నిధులు విడుదల చేసి 'మన ఊరు-మన బడి' పథకం పనులు పూర్తిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం నిధులు ఇచ్చేనా?!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన 'మన ఊరు-మన బడి' పథకం ఆచరనీయం అని ప్రశంసించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సకాలంలో పాఠశాలల భవనాల నిర్మాణాలు పూర్తి కావడానికి నిధులు విడుదల చేస్తారా? అని పరిశీలకులు భావిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకం బాగుందని ప్రకటించినందున నిధులు విడుదల చేస్తారని ప్రజలు భావిస్తున్నారు.



పథకానికి కావాల్సిన నిధులు విడుదల చేయాలి

: రామిని కృష్ణ, గుత్తేదారు, ఉట్నూర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన 'మన ఊరు-మన బడి' పథకం కార్యమానికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలి. పనులు చేసినప్పటికీ సకాలంలో నిధులు రాకపోవడంతో మిగిలిన పనులు పూర్తి చేయలేకపోతున్నాం. ఈ విషయమై నూతన ప్రభుత్వం దృష్టి సారించి నిధుల ను మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పనులు జరుగుతున్నాయి

: పవార్ రమేష్, డీఈఈ, పీఆర్ ఉట్నూర్



ఉట్నూరు, ఇంద్రవెల్లి మండలాల్లో 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా మంజూరు చేసిన ఆయా ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయి. అయితే చేసిన పనులకు ఎంబీలు చేసి బిల్లులు లను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. అంతేకాకుండా గుత్తేదారులకు డబ్బులు రాగానే పనులు వేగవంతం అవుతాయి.

సంక్షిప్త సమాచారం


ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నూతన డీఎస్పీగా ఎల్ జీవన్‌రెడ్డి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఏసీపీ హుజూరాబాద్, కరీంనగర్ నుంచి ఆదిలాబాద్ డీఎస్పీగా ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు.

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నికలు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఒలింపిక్ సంఘం అబ్జర్వర్ మల్లారెడ్డి, డీవైస్ రాజువీర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దుర్గం శేఖర్, చైర్మన్‌గా పార్థసారథి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా హరిచరణ్‌ను ఎన్నుకున్నారు.


తోషం వెళ్లే దారిలో పూసిన మోదుగ పూలు

విరగబూసిన మోదుగ పూలు

గుడిహత్నూర్, ఫిబ్రవరి 18: మండలంలోని మోదుగ చెట్లు విరగబూసి చూసే వారి మదిని దోచేస్తున్నాయి. వేసవి సీజన్ వచ్చిందంటే చాలు అన్ని చెట్లు ఆకులు రాల్చి చిగురుటాకులతో ఆకట్టుకోగా.. మోదుగ చెట్లు మాత్రం విరగబూసిన పూలతో కనువిందు చేస్తున్నాయి. శివరాత్రి, హోలీ పండుగలకు ఈ పూలు అత్యంత ప్రాధాన్యమని పెద్దలు చెబుతారు. రోడ్డుకు ఇరువైపులా కాషాయరంగులో ఉండి అటుగా వెళుతున్న వారిని ఇట్టే ఆకర్షిస్తున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

భీంపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని నిపాని గ్రామానికి చెందిన గణేష్ అనే వ్యక్తి పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేశామని ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఇతను పోలీస్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించి ట్యాబ్ ధ్వంసం చేశాడని ఎస్సై వివరించారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆదివారం ఆర్టీసీ బస్సులు ఫుల్!

● మహాలక్ష్మి పథకంతో ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్సులు ● ట్రిప్పులు సరిపోక.. బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తులు


● ఆర్టీసీ బస్సులో నిండుగా వెళుతున్న ప్రయాణికులు

తలమడుగు, ఫిబ్రవరి 18: ఆదివారం ఆర్టీసీ బస్సులో ఫుల్ ప్రయాణికులు ప్రయాణించడంతో సీట్లు దొరక్క ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో.. మిగతా ప్రయాణికులకు సీట్లు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆదివారం మారుమూల గిరిజన గ్రామమైన కోసాయి, ఉమ్రి నుంచి ఆదిలాబాద్ వెళుతున్న బస్సు ప్రయాణికులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమని, మరిన్ని బస్సుల సంఖ్య పెంచితే ప్రయాణికులతో పాటు మిగతా ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బస్సులకు వెచ్చించే చార్జి డబ్బులతో ఇంటికి సరిపడా కూరగాయాలు వస్తున్నాయన్నారు. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండల కేంద్రంలో నుంచి కోసాయి వరకు వెళ్లే బస్సుల సంఖ్య మరింత పెంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా త్వరలో పరీక్షల సమయం రావడంతో విద్యార్థులకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఉమ్రి, కోసాయి మీదుగా వెళ్లే బస్సుల్లో ప్రయాణిస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సు సమయానికి రాకపోతే ప్రైవేట్ వారికి ఎక్కువ డబ్బులు చెల్లించి వెళ్లే.. పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారుల స్పందించి మరిన్ని బస్సుల సంఖ్యను పెంచాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఇచ్చోడలో కరపత్రాలను విడుదల చేస్తున్న బంజారా సభ్యులు


నేరడిగొండలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సంత్ సేవాలాల్ జయంతి కరపత్రాల విడుదల

ఇచ్చోడ, ఫిబ్రవరి 18: జిల్లాకేంద్రంలో ఈనెల 20న రాంలీల మైదానంలో నిర్వహించే సంత్‌శ్రీ సేవాలాల్ జయంతి వేడుకలకు జిల్లావ్యాప్తంగా బంజారాలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల బంజారా సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జయంతికి సంబంధించిన కరపత్రాలను ఇచ్చోడ మండలంలోని ఇచ్చోడ తండా, సాత్‌నందర్, ముక్రా తండా, తదితర గ్రామాల్లో ఆదివారం ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తూ కరపత్రాలను విడుదల చేశారు. ప్రతీ గ్రామం నుంచి ప్రతీఒక్కరు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉత్తంసింగ్, ధరమ్‌సోతు, జాదవ్ రమేష్, సోమేశ్వర్, అంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: జిల్లాకేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 20న నిర్వహించనున్న సేవాలాల్ జయంతికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. భారీ ఎత్తున నిర్వహించే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వినాయక్ పరుశురాం, బాబులాల్, మహేందర్ జాదవ్‌లైవ్, వసంత రావు లైవ్, గోవర్ధన్ భీమ్‌జీ నాయక్, అంజాబీ, తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశపరీక్ష

ఇచ్చోడ, ఫిబ్రవరి 18: గురుకులాల ప్రవేశం కోసం నిర్వహిస్తున్న సీవోఈ ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంతో పాటు ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. సిబ్బంది విద్యార్థులు హాల్‌టికెట్లు పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద సంబంధిత అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.


హుండీ లెక్కిస్తున్న అధికారులు మెస్రం వంశీయులు

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

● హుండీ ద్వారా రూ.8 లక్షల, 62 వేల 15 రాగా,
● ట్రై బజార్ ఆదాయం రూ. 3లక్షల 9 వేలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18: ఈనెల 9 నుంచి నిర్వహించిన నాగోబా జాతరలో భాగంగా నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని ఆదివారం మెస్రం వంశీయులు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్వహించారు. నాగోబా జాతరలో ట్రైబజార్ ద్వారా రూ.3 లక్షల 9వేల ఆదాయం రాగా నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.8 లక్షల 62 వేల 15 ఆదాయం వచ్చిందని, అలాగే కానుకల రూపంలో 425 గ్రాముల వెండి వచ్చినట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, మెస్రం వంశం, పెద్దలు మెస్రం కోను, కోసేరావు, బాదిరావు పటేల్, మెస్రం వంశం ఉద్యోగస్తులు మెస్రం శేఖర్ బాబు, సోనేరావు, కోసేరావు, తదితరులు ఉన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అస్సాంకు చెందిన గిరిజనులు ఢిల్లీలో ఎంపీ సోయం బాపురావును మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను ఆయనకు తెలిపారు. రిజర్వేషన్ల పాలసీల యొక్క ససమస్యలు అస్సాంలో గిరుజనులు ఎదుర్కొంటన్నారన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న ఆర్థిక సాంకేతికంగా, సామాజిక, విద్య, వైద్య సమస్యలుపై వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. స్పందించిన ఆయన గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అస్సాం గిరిజనులు కాశీరాం, గంగారం, దీరు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18: ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బస్సు యాత్ర ఇన్‌చార్జీ రావుల రాంనాథ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. ఈనెల 20న బాసర నుంచి ప్రారంభమై ముధోల్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల గుండా కొనసాగుతుందన్నారు. ఈనెల 22న ఇంద్రవెల్లిలో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు, జడ్పీటీసీ పుష్పలతా, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ దీపక్‌సింగ్, శేఖవాత్, నాయకురాలు రాథోడ్ రాధిక, పెందోర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బస్సు యాత్ర ఇన్‌చార్జీ రావుల రాంనాథ్

అనాథ శవానికి అంత్యక్రియలు

మావల, ఫిబ్రవరి 18: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాగా, మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో ఎస్సై ముజాహిద్ స్మైల్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు మృతదేహానికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

జిల్లాకు స్వర్ణ పథకం

తలమడుగు, ఫిబ్రవరి 18: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న 19వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో ఆదిలాబాద్‌కు స్వర్ణ పతకం లభించింది. అండర్-14 జావెలిన్ త్రోలో జిల్లాకు చెందిన యర్మ లింగు 57.27 మీటర్లు జావెలిన్ విసిరి స్వర్ణ పతకం సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ పి.రాజేష్ తెలిపారు.

పెన్షన్ కోసం పరేషాన్!

● అధికారుల నిర్లక్ష్యంతో ప్రతీనెల ఇబ్బందులే.. ● ఇతర ప్రాంతాలకు వెళ్లి తీసుకుంటున్న వృద్ధులు ● పట్టించుకోని అధికారులు


వామన్‌నగర్ నుంచి తాంసికి కాలినడకన వస్తున్న గిరిజన వృద్ధ మహిళలు

తాంసి, ఫిబ్రవరి 18: పెన్షన్ తీసుకునేందుకు వృద్ధులు పడరాని పాట్లు పడుతున్నారు. మైళ్ల దూరం కాలినడకన వచ్చి పెన్షన్ తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వృద్ధులకు ప్రతీనెల పెన్షన్‌ను గ్రామానికి వెళ్లి పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ పెన్షన్ పంపిణీదారులు ఏనాడూ వృద్ధులకు సకాలంలో పెన్షన్‌ను అందించి దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం.. పర్యవేక్షణ లోపమే కారణమని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతినెల పెన్షన్ కోసం లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిప్రాంతాల్లో సరిగ్గా సిగ్నల్ లేకపోవడం ఒక కారణమైతే.. మరికొన్ని ప్రాంతాల్లో పెన్షన్ పంపిణీదారులు సకాలంలో రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాంసి మండలంలో 13 గ్రామ పంచాయతీలు, మూడు అనుబంధ గ్రామాలు కలిపి మొత్తం 16 గ్రామాలున్నాయి. కొన్ని గ్రామాల్లో గిరిజనులకు ప్రతీనెల సకాలంలో పెన్షన్లు కూడా అందడం లేదు. గత రెండు నెలలుగా తాంసి మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న వామన్‌నగర్‌కు వృద్ధులు కాలినడకన వెళ్లి పెన్షన్లు తీసుకుంటున్నారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు వాపోతున్నారు. ఆటోలో వస్తే ఒక్కొక్కరికి రూ.100 వసూలు చేస్తున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము కాలినడకనేపోయి పెన్షన్లు తీసుకుంటున్నామని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృద్ధులకు తమ గ్రామంలోనే సకాలంలో పెన్షన్ అందించేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

సిరికొండ, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని బోయవాడ కాలనీలో దాదాపు రూ.2.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జింక నర్సింలు, గంగన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


● సిరికొండలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రికెట్ పోటీలు

● మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 18: ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్మల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరయ్యారు. 40 ఏళ్ల అనుభవం గల సీనియర్ జట్టుతో జూనియర్ జట్టు పోటీ పడింది. ఎవరికి వారే ధీటుగా ఆడి ప్రతిభ చాటారు. అన్ని రకాల క్రీడలు నిర్వహించేలా ఎన్టీఆర్ మినీ స్టేడియంను అభివృద్ధి చేసుకున్నట్లు చైర్మన్ ఈశ్వర్ తెలిపారు.

సేవాలాల్ శోభాయాత్రపై దాడి చేసిన వారిపై

చర్యలు తీసుకోకుంటే ఆందోళన

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేష్ బాబు



మాట్లాడుతున్న భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్‌బాబు

భైంసా, ఫిబ్రవరి 18: కుభీర్ మండల కేంద్రంలో గురువారం జరిగిన సేవాలాల్ జయంతి శోభాయాత్రపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన తప్పవని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేష్‌బాబు వెల్లడించారు. ఆదివారం భైంసాలో జిల్లా లంబాడా ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుభీర్‌లో శోభాయాత్ర కొనసాగుతున్న సందర్భంలో కొంతమంది అల్లరి మూకలు అడ్డుకున్నాయని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో అల్లరి మూకలు రాళ్లతో జరిపిన దాడిలో చవాన్ అవినాష్ అనే యువకుడు తీవ్రగాయాల బారిన పడ్డాడని వివరించారు. సంబంధిత ఘటనపై బాధితుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తుండగా అక్కడ మరోమారు అల్లరి మూకలు దాడికి తెగబడ్డాయని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురు నిందితులను గుర్తించి వారితోపాటు మరో 30 మంది ఇతరులపై కేసునమోదు చేశారని వెల్లడించారు. అయితే ఘటన జరిగి మూడురోజులు గడిచినా పోలీసులు నిందితులెవరిని అరెస్టు చేయడం, రిమాండ్‌కు తరలించకపోవడం విచారకరమని తెలిపారు. పోలీసులు ఉదాసీన వైఖరి విధానాలను వీడి నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లంబాడ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

'చలో సెక్రటేరియట్ విజయవంతం చేయండి'

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 18: ఈనెల 20 మంగళవారం ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యోగేష్ కుమార్‌శర్మ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ పిలుపు మేరకు ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారం కోసం, నూతన అర్చకులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతన విడుదల, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ధూపదీప నైవేద్య అర్చకులు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం చేపట్టి చలో సెక్రటేరియల్‌లో అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

కుక్కల దాడికి జింక మృతి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 18: కుక్కల దాడికి జింక మృతి చెందిన ఘటన మండలంలోని మునిపెల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుడైన గురాల లింగారెడ్డి గోదావరి గట్టున గల తన పంట పొలంలోకి వెళ్తుండగా కుక్కలు జింకపై దాడిచేస్తున్న దృశ్యాన్ని చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ సమాచారం తెలుసుకు న్న అటవీశాఖ అధికారులు వచ్చి క్షేత్రస్థాయికి వెళ్లి చూడగా జింక మరణించిందని తెలిపారు. దీంతో అటవీ అధికారులు జింక అంత్యక్రియలు పూర్తిచేసి వెళ్లినట్లు తెలిపారు.



కుక్కల దాడికి తీవ్ర గాయాలపాలైన జింక

గో సంరక్షణ సేవలో తరించాలి

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేష్ బాబు



గోశాల షెడ్డులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 18: గోమాత ఎంతో పవిత్ర మైనదని, అటువంటి గోవుల సంరక్షణ సేవలో ప్రతీఒకరు తరించాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసా శ్రీ గో రక్షణ సంస్థ నూతనంగా నిర్మించి షెడ్, కార్యాలయాలను గోశాల కోసం 391 ఎకరాల భూమిని ధానంగా ఇచ్చిన శామ్ అస్తద్ ఛినాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ మాట్లాడుతూ శ్రీ గో రక్షణ సంస్థ పరిరక్షణకు, పటిష్టతకు పాటుపడుతానని పేర్కొన్నారు. సంస్థ నిర్వహణకు, అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని విధాలుగా అంకిత భావంతో కృషిచేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా గోశాల కోసం గాను 391 ఎకరాల భూమిని దానంగా ఇచ్చిన దాత కుటుంబీకుడు శామ్ అస్తద్ ఛినాయ్‌ను శ్రీ గోరక్షణ సంస్థ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించింది. ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ సంచాలక్ సాధుల కృష్ణదాస్,వ్యాపారవేత్తలు నాగ్‌నాథ్ పాటిల్, రమేష్ మందాని, టౌన్ సీఐ రాజారెడ్డి, శ్రీ గోరక్షణ సంస్థ అధ్యక్షుడు నిమ్మల ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్ పాటిల్, సహకార్యదర్శి సిందే లక్ష్మణ్, ప్రతినిదులు దత్తు, రామకృష్ణ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

బాసర, ఫిబ్రవరి 18: హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్‌కుమార్ ఆదివారం బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి పండితులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని న్యాయమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆలయ పండితులు ఆశీర్వదించారు.

నేడు ఖానాపూర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర

ఖానాపూర్, ఫిబ్రవరి18: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాశవేణి ప్రణయ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు స్థానిక విశ్రాంతి భవనం వద్ద బజరంగ్ దళ్ విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో కాషాయ ధ్వజావిష్కరణ నిర్వహించి ఈ శోభాయాత్రను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హిందువుల ఐక్యతకు చిహ్నంగా నిర్వహిస్తున్న శోభాయాత్రకు ప్రతీఒక్క హిందువు హాజరుకావాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో ఎద్దు మృతి

సారంగాపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని అడెల్లి తండాలో ఆదివారం కుక్కల దాడిలో ఎద్దు మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. తండా వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడెల్లి తండాకు చెందిన మోహన్ అనే రైతు ఎద్దును కుక్కలు దాడి చేయడంతో ఎద్దు మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. ఈ ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని పేర్కొన్నాడు.



మండపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల బోర్డు

అధికారులూ స్పందించరూ..!

బాసర, ఫిబ్రవరి 18: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షర శ్రీకారం జరిపించే మండపంలోని కరెంట్ బోర్డు ప్రమాదకరంగా ఉంది. అర్చకులు చిన్నారులకు పూజలు జరిపించే పక్కనే కరెంటు తీగలు బయటే ఉంటున్నాయి. పిల్లలు ఏ మాత్రం ఆదమరిచినా పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కాలుష్య కాసారంగా పెద్ద వాగు

● ఎస్పీఎం వ్యర్థాలతో కలుషితమవుతున్న పెద్దవాగు జలాలు
● పట్టించుకోని పొల్యూషన్ బోర్డు
● నీటిని వ్యవసాయానికి వినియోగిస్తున్న రైతులు



మసాల ఒర్రె వద్ద ప్రవహిస్తున్న ఎస్పీఎం వ్యర్థ జలాలు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 18: సిర్పూరు పేపరు మిల్లు (ఎస్పీఎం) కాలుష్యంతో ప్రమాదం ఏర్పడుతోంది. ఫ్యాక్టరీ నుంచి వెలువడే విషరసాయన జలాలు నురగలు కక్కు తూ పెద్దవాగులో కలిసి నీటిని కలుషితం చేస్తున్నాయి. కాగితపు తయారీలో కీలకమైన గుజ్జు శుద్ధి చేసే క్రమంలో 200రకాలకుపైగా రసాయానాలను వాడుతారు. పల్ప్ (గుజ్జు) శుద్ధి చేసిన తర్వాత విడుదలయ్యే వ్యర్థ జలాల్లో ఇంకా రసాయన అవశేషాలు మిగిలి ఉండటం వల్ల నీరంతా కాలుష్య కాసారంగా మారుతోంది. నురగులు కక్కుతు ప్రవహించే నీటిని కాగజ్‌నగర్ పరిసరాల్లో చాలా మంది రైతులు వరిసాగుకు వినియోగిస్తున్నారు. ఈ విధంగా పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించిన వారికి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● మండలవాసులకు తప్పని రోగాలు..

కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాల గుండా ఈ వ్యర్థ జలాల ప్రవాహం వెళుతుంది. ఈ నీరు ప్రవహించిన పంట భూములన్నీ తెల్లబారిపోయి దిగుబడి కూడా తగ్గుతున్నట్టు తెలుస్తోంది. చాలా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభావితం అవుతున్నట్టు ఆరోపణలున్నాయి. కొంత కాలంగా ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే జలాలతో పెద్దవాగు నీరు దుర్వాసన వస్తోందని రైతులు చెబుతున్నారు. కాగితం తయారీలో వాడే రసాయానాల వల్ల రోగ నిరోధక శక్తి తగ్గి పోవటం, గుండె, ఊపిరితిత్తుల, కంటి సంబంధిత వ్యాధులు, శ్వాసన నాళ సంబంధిత వ్యాధులు, దగ్గు, దమ్ము వంటి అనారోగ్యకరమైన దుష్ప్రభావాలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యర్థజలాల శాంపిల్స్‌ను సేకరించి పరీక్షించాల్సిన కాలుష్యనియంత్రణ మండలి అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడరు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు అందితే తప్పా అధికారులు వచ్చే పరిస్థితి లేదని ఆయా మండలాల ప్రజలు పేర్కొంటున్నారు. ఎస్పీఎం పరివాహక ప్రాంతాల్లోని కాలనీలు, గ్రామాల్లో ఈ వ్యర్థ జలాలతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు ఈ వాసన భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవటం లేదంటున్నారు. పైగా పల్ప్ శుద్ధి తర్వాత విడుదలైన వ్యర్థ జలాలలో ఎలాంటి హానికారక రసాయాలు లేవని ఫ్యాక్టరీ ప్రతినిధులు పేర్కొంటున్నారు కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 16 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్‌పోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎంసాక్షి అండర్-14 కిడ్స్ జావిలిన్‌త్రో విభాగంలో అత్యంత ప్రతిభకనబర్చి రికార్డు సృష్టించినట్లు గిరిజన సంక్షేమ క్రీడాఅధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు తెలిపారు. జావిలిన్‌త్రో విభాగంలో 29.97 మీటర్ల దూరంవిసిరి బ్రోంజ్‌మెడల్ సాధించిం దన్నారు. ఉత్తమప్రతిభ కనబర్చిన సాక్షిని, శిక్షకుడు విద్యాసాగర్‌ను ట్రైబల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమా దేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్ రమేష్, విజయ్, శంకర్, లక్ష్మణ్, అరవింద్, తిరుమల్, స్వప్న, తదితరులు అభినందించారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18: ఈ నెల 21న జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న జాతర ఉంటుందని తెలిపారు. భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండటంతో బ్యారికేడ్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

గిరిజనులకు బట్టల పంపిణీ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18: మండలంలోని దరిగాం అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఆదివారం శ్రీమిత్ర సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరితిరుపతి బట్టలుపంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గడ్డివాము దగ్ధం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18: నందిగూడలో నివాసం ఉంటున్న రమేష్ ఇంటి ఆవరణలో ఉన్న గడ్డివాము ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. రమేష్, కుటుంబ సభ్యులు స్పందించి ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం కాలనీవాసులు నీటితో మంటలను ఆర్పేశారు. గడ్డివాము పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పరిహారం చెల్లించాలని రెవెన్యూ అధికారులను బాధితుడు కోరాడు.

దుమ్ము లేస్తోంది!

● పడకేసిన అభివృద్ధి పనులు ● అధ్వానంగా కాగజ్‌నగర్-సిర్పూరు(టి) ప్రధాన రోడ్డు



కోసిని వద్ద లారీలతో దుమ్ము లేస్తున్న పరిస్థితి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18: కాగజ్‌నగర్-సిర్పూరు(టి) ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. రూ.20కోట్లనిధులతో నూతనంగా బీటీరోడ్డు నిర్మించేందుకు గత ఎన్నికల ముందు అధికారులు ఆఘమేఘాల మీద పనులను ప్రారంభించారు. గుంతలు తేలిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టారు. పాత రోడ్డును తొలగించి కంకర, ఇసుక వేసి తొలిదశ పనులు చేపట్టారు. రోలర్‌తో పలుమార్లు తొక్కించారు. నిధులు విడుదల జాప్యం అవుతుండటంతో పనులను నిలిపివేశారు. దీంతో ఈమార్గం గుండా వెళ్లే వాహనాలతో దుమ్ము లేస్తోంది. లారీ, బస్సు లాంటివి వెళితే ఎదుటి వాహనం కనపడనంత దుమ్ము లేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆటోలు, బైక్‌లపై వెళ్లేవారు దుమ్ముతో నిండిపోతున్నారు. ఏ ఒక్క అధికారి కానీ, నాయకులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని వాహన దారులు పేర్కొంటున్నారు. వ్యాపారపరంగా మహారాష్ట్రకు వెళ్లే వాహనాలన్నీ ఈ రోడ్డుపై నుంచే వెళ్తుంటాయి. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్, కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లో ప్రభుత్వఉద్యోగాలు చేసే వారు ఉదయం బైక్‌లపై విధులకు వెళ్లుతుంటారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.



లారీతో కమ్మేస్తున్న దుమ్ము

● త్వరలోనే పనులను ప్రారంభిస్తాం : లక్ష్మీనారాయణ, డీఈఈ, కాగజ్‌నగర్

సిర్పూరు(టి)-కాగజ్‌నగర్ రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించాం. ఇప్పటివరకు చేపట్టిన వాటికి నిధులు విడుదల కాకపోవటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను ఆపేశారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.



మార్చి 31లోగా ఆస్తి పన్ను చెల్లించండి: కమిషనర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 18: నిర్మల్ పట్టణ మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్ను, కుళాయి, దుకాణసముదాయ బిల్లులు మార్చి 31లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. బిల్ కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు కోసం వస్తారని, వారికి సహకరించాలని పేర్కొన్నారు. సకాలంలో పన్ను చెల్లించకుంటే మున్సిపల్ చట్టం2019 ప్రకారం ఆస్తులు జప్తు చేస్తారని, పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బీజేపీ రాజకీయ యాత్ర!




- బీజేపీ కొమురం భీం సంకల్ప యాత్ర
- ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో కొనసాగింపు
- 315 కిలో మీటర్ల పొడవుతో రూట్‌మ్యాప్
- రేపు బాసరలో ప్రారంభించనున్న బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యం

నిర్మల్, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ ఇతర పార్టీల కన్నా ముందుగానే తన వ్యూహాలకు పదును పెడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ చేపట్టబోయే కార్యక్రమంలో భాగంగానే ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో కొమురంభీం సంకల్ప యాత్ర పేరిట బీజేపీ కార్యచరణ రూపొందించింది. ఈనెల 20న బాసరలో ఈ యాత్రను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగనుంది. ప్రతిరోజూ ఓ రాష్ట్రస్థాయి లేదా జాతీయస్థాయి నేత ఈ కొమురంభీం సంకల్ప యాత్రలో పాల్గొననున్నారు. మొత్తం 315 కిలో మీటర్ల పొడవుతో ఈ యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీనికి అనుగుణంగానే ఈనెల 20న బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించనున్నారు. బాసర నుంచి భైంసాకు యాత్ర చేరుకోగానే ఇక్కడ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ బహిరంగ సభలో అస్సాం సీఎం భీష్వంత్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. భైంసాలో వ్యూహాత్మకంగా ఈ బహిరంగ సభను నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను జనానికి వివరించను న్నారు. అలాగే జాతీయ, రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, అప్పటి బీఆర్ఎస్ వైఫల్యాలను ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జనాలకు చెప్పనున్నారు. భైంసాలో బహిరంగ సభ పూర్తికాగానే ఈ సంకల్పయాత్ర కల్లూర్ మీదుగా నర్సాపూర్, దిలావర్‌పూర్‌ల వరకు చేరుకోనుంది. ఈమూడు ప్రాంతాల్లో బీజేపీ రోడ్‌షోలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అనంతరం దిలావర్‌పూర్ నుంచి ఈ యాత్ర జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణం శివాజీ చౌక్ వరకు చేరుకోనుంది. ఇక్కడ బీజేపీ నేతలు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. పార్టీ నేతలంతా ఇక్కడే బస చేసి మరుసటిరోజు ఇచ్చోడ, గుడిహత్నూర్‌లలో రోడ్‌షోలు చేపట్టనున్నారు. ఇదే రోజు సాయంత్రం ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. 22న ఉదయం ఇంద్రవెల్లిలో రోడ్‌షో నిర్వహించిన తర్వాత ఉట్నూర్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత జైనూర్, కెరమెరిల్లో రోడ్‌షోలు నిర్వహించిన అనంతరం ఆసిఫాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 23న కాగజ్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించిన అనంతరం ఈ సంకల్ప యాత్ర మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించనుంది. మొత్తం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడున్నర రోజులపాటు ఈ యాత్రను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ యాత్రకు ఇన్‌చార్జిగా బీజేపీ సీనియర్ నాయకులు, పెద్దపెల్లి జిల్లా ఇన్‌చార్జీ రావుల రాంనాథ్ వ్యవహరించనున్నారు. రాంనాథ్ ఆధ్వర్యంలోనే రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. ప్రతీరోజు ఓ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకుడు తప్పనిసరిగా ఈ సంకల్ప యాత్రలో పాల్గొనడమే కాకుండా బహిరంగ సభల్లో కూడా ప్రసంగించే విధంగా రూట్ మ్యాప్ తయారు చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా చేపడుతున్న సంకల్ప యాత్ర ఆ పార్టీ గెలుపునకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఐదు బస్సు యాత్రలు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఐదు రూట్‌ల వారిగా బస్సు యాత్రలను నిర్వహించేందుకు బీజేపీ ప్రణాళికలు రూపొందించింది. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ ఈ ప్రణాళికను ఖరారు చేసింది. కొమురంభీం సంకల్ప యాత్ర, భాగ్యలక్ష్మి సంకల్ప యాత్ర, భద్రకాళి సంకల్ప యాత్ర, రాజరాజేశ్వర సంకల్ప యాత్ర, కృష్ణ మ్మ సంకల్ప యాత్రల పేరిట ఈ యాత్రలను ఖరారు చేశారు. మొత్తం ఐదు భాగాలు గా అన్ని లోక్‌సభ స్థానాలను కవర్ చేసేలా ఈ యాత్ర కొనసాగనుంది. అయితే ఈయాత్రలకు పార్టీ సీనియర్ నాయకులు అధిష్ఠానం ఇన్‌చార్జీలుగా నియమించి ప్రతిష్టాత్మక ఏర్పాట్లు చేపడుతోంది.



రోడ్ షోలు, బహిరంగ సభల సందర్భంగా భారీగా జన సమీకరణ చేపట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

రాజకీయ లక్ష్యంతోనే..

పూర్తి రాజకీయ కోణంతో బీజేపీ ఈ సంకల్ప యాత్రల ప్రణాళికకు రూపకల్పన చేసిందని అంటున్నారు. బహుళ ప్రయోజనాల సాధనకు ఈ యాత్రను ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తోంది. కేంద్రంలో బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకురావడంతోపాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని ఎండగట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయన్న అంశాన్ని ప్రజల్లో బలంగా తీసుకువెళ్లాలని ఆ పార్టీ యోచిస్తోంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐతో విచారణ జరపకుండా జ్యూడిషియల్ విచారణ జరపడంపై ఈయాత్రల సందర్భంగా ప్రజలకు వివరించనున్నారు. దీంతోపాటు దీంతోపాటు రాబోయే నాలుగున్నరేళ్లలో పార్టీని మరింత పటిష్ఠం చేసి అధికారం చేపట్టాలన్న లక్ష్యాన్ని కూడా ఈ యాత్ర ద్వారా బీజేపీ చేరుకోవాలని భావిస్తోంది.

పకడ్బందీ ఏర్పాట్లు

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని మూడు జిల్లాల్లో బీజేపీ నిర్వహించనున్న కొమురంభీం సంకల్ప యాత్ర కోసం ఆ పార్టీ లెజిస్లేచర్ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన ఇప్పటికే మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులతో ఈ సంకల్ప యాత్ర ఏర్పాట్లకు సంబంధించి సమీక్షించారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లతో చర్చలు జరిపిఏర్పాట్ల విషయమై ప్రణాళిక రూపొందించారు. ఈ యాత్రను విజయవంతం చేసేందుకు నియోజకవర్గాల వారిగా ఇన్‌చార్జీలనే కాకుండా మండలాలవారిగా ఇన్‌చార్జీలను నియమించారు. ముఖ్యంగా రోడ్‌షోలు, బహిరంగ సభలకు భారీగా జనాన్ని సమీకరించే బాధ్యతలను పార్టీ నేతలకు అప్పజెప్పుతున్నారు. మూడున్నర రోజులపాటు జరిగే ఈ యాత్రను ప్రతీ కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్న సందేశం అధిష్ఠానం నుంచి జారీ కావడంతో శ్రేణులంతా ఆ దిశగా సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా మొదటిరోజు బాసరలో ప్రారంభం కాబోతున్న యాత్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, అస్సాం సీఎం భీష్వంత్ శర్మలు హాజరుకానున్నందున భారీగా జనాన్ని సమీకరించేందుకు యోచిస్తున్నారు. భైంసా, నిర్మల్‌లలో జరిగే సభలను సక్సెస్ చేసి జిల్లాలో తమ సత్తాను చూపాలని భావిస్తున్నారు.

బాసరలో బస్సుయాత్ర ప్రారంభం



- రావుల రాంనాథ్, బీజేపీ బస్సుయాత్ర ఇన్‌చార్జి

ఈనెల 20న బాసర నుంచి కొమురంభీం సంకల్ప యాత్ర ప్రారంభమవుతుంది. యాత్ర ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో మూడున్నర రోజులు సాగుతుంది. మొదటిరోజు భైంసాలో అస్సాం సీఎం భీష్వంత్‌శర్మ హాజరుకానున్నారు. ప్రతిరోజూ ఓ ముఖ్యనేత హాజరవుతారు. పార్లమెంట్ ఎన్నికల్లో 12 స్థానాలను కైవసం చేసుకోవడమే మాలక్ష్యం. ఈ యాత్రలో ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసాలను వివరిస్తాం.

మహిళలు, చిన్నారుల సంరక్షణకు అండగా పోక్సో చట్టం

- బాధితులకు అండగా భరోసా కేంద్రం
- జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్



భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న న్యాయాధికారి, ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి18: పిల్లలకు, మహిళలకు రక్షణ కల్పిస్తూ అండగా పోక్సో చట్టం తీర్చిదిద్దినట్లు జిల్లా న్యాయాధికారి ఎ.కర్ణకుమార్ అన్నారు. ఆదివారం నిర్మల్ పట్టణంలో భరోసా కేంద్రాన్ని ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు భరోసా కేంద్రం అండగా ఉంటుందన్నారు. వేధింపులు, అత్యాచారం, బాధిత మహిళలకు, పిల్లలకు ఒకేచోట మెడికల్, న్యాయవైద్యం, కౌన్సిలింగ్, మానసిక సమస్యలు అన్ని ఒకేచోట కల్పించేందుకు రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ విభాగం ఆధ్వర్యంలో భరోసా కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసానిస్తూ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాధిత పిల్లలను, మహిళలను అక్కున చేర్చుకొని భరోసా కేంద్రం అండగా ఉంటుందన్నారు. మహిళలు, పిల్లల సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా కేంద్రం పని చేస్తుందన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసులలో కౌన్సిలింగ్ నిర్వహించి బాధిత మహిళలలకు షల్టర్ కల్పిస్తామన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, హింస తగ్గించడం భరోసా కేంద్రం లక్ష్యమన్నారు. అన్యాయానికి గురైన బాధిత మహిళలు, పిల్లలు భయపడకుండా ముందుకు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని న్నారు. చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తమచారి, గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు శైలేందర్, రాంనిరంజన్, రామకృష్ణ, మహిళా ఎస్సై సుమాంజలి, సుమలత, జ్యోతిమణి, తదితరులు పాల్గొన్నారు.



ఐకే రెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు

ప్రసన్నాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి18: జిల్లాకేంద్రంలోని గొల్లపేటలో ఆదివారం ప్రసన్నాంజనేయస్వామి సాహిత శివ పంచాయతన దేవతా పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ కే.విజయలక్ష్మి, పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్ కొండా సబితా శ్రీధర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లింబాద్రి

అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై లింబాద్రి

ఖానాపూర్, ఫిబ్రవరి18: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలు నేపథ్యంలో యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ ఎస్సై లింబాద్రి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక మహాత్మాజ్యోతి బాపూలే బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, సోషల్ మీడియాలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించారు. ఏమైనా అనుకోని విపత్కర పరిస్థితులు ఏర్పడితే ఏ విధంగా స్పందించాలనే విషయాలను వివరించారు. ఏ సమస్య ఉన్న తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు గాని పోలీసుల దృష్టికి గాని తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. సైబర్‌క్రైమ్ అయినప్పుడు ఏ విధంగా స్పందించాలో వివరించారు. ఆపత్కాలంలో 100 నంబరుకు, 1930 నంబరుకు గాని ఫోన్ చేయాలని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అలేఖ్యకు జరిగిన అన్యాయంపై మహాధర్నాకు తరలిరండి'

ఖానాపూర్, ఫిబ్రవరి18: ఇటీవల ఖానాపూర్ పట్టణంలో నడిరోడ్డుపై హత్యకు గురైన అలేఖ్య అనే యువతికి జరిగిన అన్యాయంపై పోరాడేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం ఖానాపూర్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాకు తరలిరావాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదలచేశారు. ఈ సందర్భంగా అలేఖ్య హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, వెంటనే ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఏర్పాటుచేయాలని, అలేఖ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌లతో ఈ మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాధర్నాకు ప్రతి ఒక్కరూ హాజరై మహిళలపట్ల జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాల సమర్పణ

భైంసా, ఫిబ్రవరి18: పట్టణంలోని వివిధ కాలనీలకు భక్తులు ఆదివారం పోచమ్మ, మైసమ్మలతో పాటు మహాలక్ష్మీ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. తమ కుటుంబ సభ్యులందరికీ ఎలాంటి ఆపదలు వాటిల్లకుండా చూడాలంటూ, సుఖసంతోషాలు ప్రసాదించాలంటూ వేడుకుంటూ ఆలయాల్లో పూజలు చేపట్టి నైవేద్యాలు సమర్పించారు. స్థానిక నేతాజీనగర్ కాలనీవాసులు నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ గాలి రవి, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్‌తో కలిసి ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ నెత్తిన బోనాన్ని ఎత్తుకొని తీసుకవెళ్లి మైసమ్మ క్షేత్రంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ మైసమ్మ క్షేత్ర అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని వెల్లడించారు.




- నెత్తిన బోనంతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

మేడారం జాతరకు 445 బస్సులు

- ఐదు కేంద్రాల నుంచి బస్సుల రాకపోకలు
- నేటి నుంచి 25 వరకు నడవనున్న బస్సులు
- మహిళలకు ఉచితంగానే బస్సు ప్రయాణం





భైంసా, ఫిబ్రవరి 18: తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు టీఎస్ ఆర్‌టీసీ ఆదిలాబాద్ రీజియన్ పరిధి నుంచి 445 బస్సులు బయలుదేరనున్నాయి. సోమవారం రీజియన్ పరిధిలోని 6 డిపోల నుంచి బస్సులు జాతరకు కోసం వెళ్లనున్నాయి. సంబంధిత బస్సులు శనివారం ఆయా డిపోలకు తరలిరానున్నాయి.

ఐదు కేంద్రాల నుంచి బస్సుల రాకపోకలు

మేడారం జాతరకు ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని బస్సులు ఐదు కేంద్రాల నుంచి భక్తులకు సేవలందించనున్నాయి. చెన్నూర్ కేంద్రం నుంచి 85 బస్సులు, శ్రీరాంపూర్ కేంద్రం నుంచి 80 బస్సులు, మంచిర్యాల్ కేంద్రం నుంచి 140 బస్సులు, మందమర్రి కేంద్రం నుంచి 40 బస్సులు, బెల్లంపెల్లి కేంద్రం నుంచి 100 బస్సులు నడవనున్నాయి.

నిజామాబాద్ రీజియన్ నుంచి 185 బస్సుల కేటాయింపు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఇక్కడి రీజియన్‌కు నిజామాబాద్ నుంచి 185 బస్సులను కేటాయించారు. సంబంధిత బస్సులు ఆదిలాబాద్ రీజియన్‌కు కేటాయించిన కేంద్రాల నుంచి భక్తులకు సేవలందించనున్నాయి. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 260 బస్సులతో నిజామాబాద్ రీజియన్ నుంచి కేటాయించిన 185 బస్సులు కలిపి మొత్తం 445 బస్సులు ఐదు కేంద్రాల ద్వారా మేడారం జాతర భక్తులను చేరవేయనున్నాయి.

ఆరు డిపోల నుంచి 260 బస్సులు

రీజియన్ పరిధిలోని 6 బస్సు డిపోల నుంచి 260 బస్సుల మేడారం జాతరకు సోమవారం నుంచి తరలనున్నాయి. ఆదిలాబాద్ డిపో పరిధి నుంచి 43, నిర్మల్ డిపో నుంచి 29, భైంసా డిపో నుంచి 35, ఉట్నూర్ డిపో నుంచి 10 , మంచిర్యాల్ డిపో నుంచి 95, బెల్లంపెల్లి డిపో నుంచి 45 బస్సులు జాతర కోసం తరలిస్తున్నారు.

జాతరకు మహిళలకు ఉచిత ప్రయాణమే..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇప్పటికే మహాలక్ష్మీ పథకం కింద డిసెంబర్ 9 నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే,ఇందులో భాగంగానే మేడారం జాతరకు కూడా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు.

ఏడు రోజులు తప్పని ఇబ్బందులు

మేడారం జాతకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 6 డిపోల పరిధి నుంచి 260 బస్సులను కేటాయించారు. ఈ క్రమంలో జాతర జరిగే ఏడు రోజులు పాటు ఉమ్మడి జిల్లాలో బస్సుల సంఖ్య తగ్గి ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి.ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు డిపోల పరిధిలో మొత్తం 557 బస్సులు ఉండగా ఇందులో జాతరకు 260 బస్సులు తరలనున్నాయి. ప్రధాన రూట్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ రూట్లలో బస్సులను రద్దు చేసి జాతరకు తరలిస్తుండటంతో ప్రయాణీకులకు రాకపోకల విషయంలో ఇబ్బందులు ఏర్పడనున్నాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి

కుంటాల, ఫిబ్రవరి 18: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కల్లూరు వాసవి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కల్లూర్ గ్రామంలోగల వాసవి జూనియర్ కళాశాల 20వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌లు సాయిలు, శ్రీనివాస్, డైరెక్టర్ హరిప్రసాద్, జానకిరామ్ సిబ్బంది ఉన్నారు.

రేపు విద్యార్థులకు పోటీలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 18: ఆర్‌బీఐ సౌజన్యంతో ఎస్బీఐ లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈనెల 20న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్, పోస్టర్ మూడు రంగాల్లో పోటీలుంటాయని, ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో రంగానికి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు 2వేల రూపాయల క్యాష్ ప్రైజ్ అందజేస్తారన్నారు.